ఇష్టారాజ్యంగా విధులు !

- సమయ పాలన పాటించని పంచాయతీ కార్యదర్శులు
- ఫీల్డ్ వర్క్ అంటూ అందుబాటులో ఉండని వైనం
- తీవ్ర ఇబ్బందుల్లో ప్రజలు .. పేరుకుపోతున్న సమస్యలు



దేవగిరి సచివాలయంలో సిబ్బంది లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

బొమ్మనహాళ్: మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శుల పనితీరు చాలా అధ్వానంగా మారింది. సచివాయలంలో ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించాల్సి ఉన్నా అందతా పట్టనట్టు ఉదయం సచివాలయానికి హాజరై వెళ్లిపోతున్నారు. మధ్యాహ్నం గంట మోగితే చాలు మండల ఆఫీసులో మీటింగ్ ఉందని, ఆ సార్ పిలుస్తున్నారని, వీసీ ఉందని, ఇలా ఏఓ కారణాలు చెప్పి మండల కార్యాలయానికి చేరుకుంటున్నారు. అక్కడ సాయంత్రం వరకూ కాలక్షేపం చేసి ఇంటికెళ్తున్నారు. ఇక.. మండల కార్యదర్శులు ఏదో ఒక టీ షాపు, హోటల్‌లో కాలక్షేపం చేస్తూ ఇంటికి వెళ్లిపోతున్నారు. దీంతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. కొందరు కార్యదర్శులైతే ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

19 గ్రామ పంచాయతీలు

మండల పరిధిలో మొత్తం 19 గ్రామ పంచాయతీలు, 15 సచివాలయాలు ఉన్నాయి. అందులో పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారు. ఉదయం నుంచి ఓ గంట పాటు గ్రామ సచివాలయంలో ఉంటున్నారు. మధ్యాహ్నం అయితే మండల కార్యాలయాలకు చేరుకుంటున్నారు. కొందరైతే సచివాలయానికి వెళ్లినా ఒకరు, లేదా ఇద్దరు తప్ప కార్యదర్శులు ఉండడం లేదని స్థానికులు వాపోతున్నారు. అన్ని తెలిసినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. పంచాయతీ కార్యదర్శులు ఉదయం, సాయంత్రం వేళల్లో హాజరు వేయాల్సి ఉంటుంది. కానీ కొందరు పంచాయతీ కార్యదర్శులు మధ్యాహానికే వెళ్లిపోతున్నారు. మరికొందరు మీటింగ్‌లు, వీడియో కాన్ఫరెన్సులు, మండల కార్యాలయంలో పని ఉందంటూ రకరకాల సాకులతో సచివాలయాల నుంచి మెల్లగా జారుకుంటున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక అధ్వానం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహాత్మాగాంధీ కన్న కలలను ప్రతిరూపాలుగా సచివాలయాలు ఆవిర్భవించాయి. గ్రామ స్వరాజ్యాన్ని ప్రజలకు చేరువచేయాలన్న లక్ష్యంతో జగనన్న ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ప్రతి సచివాలయంలో గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శితో పాటు వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్, వ్యవసాయ వెటర్నరీ, పీహెచ్, సర్వేయర్లు, వీఆర్వోలు అందుబాటులో ఉంటారు. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా సచివాలయాలు పనిచేశాయి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవస్థకు తూట్లు పొడిచి నిర్వీర్యం చేస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. సచివాయల ద్వారా 545 సేవలు ప్రజలకు అందేవి. ప్రస్తుతం కూటమి పాలనలో పరిస్థితులు గందరగోళంగా తయారైంది. దీనికి తోడు సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్న విమర్శలున్నాయి. ఇంతవరకూ కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డు వెబ్‌సైట్లు తెరుచుకోలేదు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కఠిన చర్యలు తప్పవు



సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు విధిగా సమయ పాలన పాటించాలి. వివిధ పనుల కోసం వచ్చే ప్రజలతో గౌరవంగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. సమస్య జటిలమైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. విధులను నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవు. సచివాలయంలో అధికారులు లేకపోతే కఠిన తీసుకుంటాం.

– విజయభాస్కర్, ఎంపీడీఓ బొమ్మనహాళ్

పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టండి



సంపద తయారీ కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌పీఓ దేవదాస్

కుందుర్పి: మండల కేంద్రంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ దేవదాస్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో పర్యటించారు. ప్రధాన రహదారిపై ప్రైవేటు వ్యక్తులు మురుగునీరు వదిలిన విషయాన్ని గుర్తించిన ఆయన ఎంపీడీఓ శంకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగునీరు వదలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన చెత్త నుంచి సంపదతయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఇదిలా ఉండగా అధికార పార్టీ నాయకులే ఇళ్ల నుంచి రోడ్లపై మురుగునీరు వదులుతున్నారని, అక్రమంగా కుళాయిలు వేసుకున్నారని పలువురు డీఎల్‌పీఓకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్ మారుతేశ్వరీ తదితరులు ఉన్నారు.

నేడు హనుమాన్ జయంతి వేడుకలు



ఉక్కడ ఆంజనేయస్వామి మూలవిరాట్

బొమ్మనహాళ్: నేమకల్లు ఆంజినేయస్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నరసింహారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌స్వామి తెలిపారు. ఉదయం 5.30 గంటలకు సుప్రభాత సేవ, 8 గంటలకు స్వామి దివ్య దర్శనం విశేష అలంకరం, 9.30 గంటలకు స్వామివారి హనుమద్ వ్రతం తదితర పూజలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 12.30 గంటల తర్వాత మడుగు తేరు లాగనున్నట్లు పేర్కొన్నారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డులోని ఉక్కడ ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, నామకరణ మహోత్సవం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు స్వామి వారి రథోత్సవం జరుగుతుందన్నారు.

రిజర్వాయర్‌కు మరమ్మతులు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రమావత్ దేవి

వజ్రకరూరు: కొనకొండ్ల గ్రామంలోని సత్యసాయి రిజర్వాయర్‌కు మరమ్మతులు చేపట్టాలని ఎంపీపీ రమావత్ దేవి కోరారు. బుధవారం అనంతపురంలోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సాధారణ సర్వసభ్య సమావేశంలో మండలానికి సంబంధించిన పలు సమస్యలను కలెక్టర్ వినోద్ కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ దృష్టికి తీసుకెళ్లారు. సత్యసాయి రిజర్వాయర్‌కు నెర్రెలు, చీలికలు రావడంతో వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. కొనకొండ్లలో ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరుగుతున్నాయని వివరించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు డీడీలు చెల్లించినా అందడం లేదని పేర్కొన్నారు. వెంకటాంపల్లి పెద్ద తాండాలో ఉన్న సబ్‌సెంటర్‌కు వైద్య సిబ్బందిని నియమించాలని కోరారు. సమస్యలపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు ఎంపీపీ రమావత్ దేవి పేర్కొన్నారు.

పొంగిన వేదవతి హగరి



వేదవతి హగిరి రోడ్డుమీదుగా ప్రవహిస్తున్న వరదనీరు

- కోతకు గురైన తారు రోడ్డు
- కణేకల్లు–ఉరవకొండ రూట్‌లో రాకపోకలు బంద్

కణేకల్లు: భారీ వర్షాలకు వేదవతి హగిరి నది పరివాహక ప్రాంతం పొంగి ప్రవహిస్తోంది. భారీ వర్షంతో పాటు వరద ఉధృతికి కణేకల్లు శివారులోని వేదవతి హగిరి రోడ్డు దెబ్బతింది. దీంతో కణేకల్లు – ఉరవకొండ రూట్‌లో బుధవారం రాకపోకలు బంద్ అయ్యాయి. ఆ మార్గంలో తిరిగే ఆర్టీసీ బస్సులను అధికారులు నిలిపేశారు. ఉరవకొండ నుంచి కణేకల్లుకు రావల్సిన ఆర్టీసీ బస్సులు మాల్యం వద్ద ఆపేసి అటు నుంచి అటే ఉరవకొండకు వెళుతున్నాయి. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించి హెచ్చెల్సీ అక్విడెక్ట్ మీదుగా కణేకల్లుకు చేరుకుంటున్నారు. ఒకటిరెండ్రోజుల తర్వాత వరద ఉధృతికి తగ్గినా... బస్సుల రాకపోకలకు ఈ రోడ్డు అనుకూలించే పరిస్థితి లేదు. డిప్యూటీ తహసీల్దార్ విశ్వనాథ్, వీఆర్వో పవన్‌కుమార్ వేదవతి హగిరి మీదుగా ప్రజలు రాకపోకలు కొనసాగించకుండా అప్రమత్తం చేశారు. ఇటువైపు ఎవ్వరూ వెళ్లే సాహసం చేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

బ్రహ్మసముద్రం : పిల్లలపల్లి గ్రామానికి చెందిన వెంకటేశులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు భార్య జ్యోతి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న గ్రామస్తులు బుధవారం రూ.9 వేలు, ఇన్‌ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు దొణతిమ్మ , గ్రామస్తులు శివారెడ్డి, రవి, హనుమంతు, తిమ్మన్న, వినయ్, మారెన్న, కొండాపురం మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

బొమ్మనహాళ్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం నూతన మండల కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రాజీవ్ తెలిపారు. బుధవారం మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో వారు మాట్లాడుతూ బొమ్మనహాళ్ మండల అధ్యక్షుడిగా పి.సిద్దయ్య, ఉపాధ్యక్షుడిగా హనుమంతు, యూత్ అధ్యక్షుడిగా ఇస్మాయిల్, డీ.హీరేహాళ్ మండల అధ్యక్షుడిగా లాలు సాబ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఉచిత కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుల్లో ఉచిత శిక్షణకు నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నెలల పాటు జరిగే ఉచిత కోర్సుల్లో ప్రవేశానికి టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 25లోగా పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9182920381 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

యోగాసనాల్లో ఉచిత శిక్షణ

అనంతపురం కల్చరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెలరోజుల పాటూ సాగే యోగాసన శిక్షణ బుధవారం వివిధ యోగా కేంద్రాల్లో ప్రారంభమైంది. వివేకానంద యోగకేంద్రం అధ్యక్షుడు మెళవాయి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ.. జూన్ 21 వరకు వివేకానంద యోగా కేంద్రాలైన ఆర్ట్స్ కాలేజీ, మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం, జిల్లా పరిషత్తు హాలు, అశోక్ నగర్‌లోని సరస్వతీ విద్యామందిరం, రామనగర్ కమ్మభవన్, షిరిడీ నగర్‌లో వివేకానంద ప్రధాన కార్యాలయం, కోవూరు నగర్‌లోని విద్యారణ్య ప్రాంగణం తదితర చోట్ల ప్రోటోకాల్ ప్రకారం శిక్షణ ఉంటుందన్నారు. జూన్ 14, 15 తేదీల్లో యోగాసన పోటీలుంటాయని తెలిపారు. విజేతలకు యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ అనంతపురం తరఫున అధికారుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారన్నారు. ఆసక్తి కల్గిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఆయా కేంద్రాలతో పాటూ 9963028694, 9441734555 నంబర్లలో సంప్రదించాలన్నారు.

దంచికొట్టిన వాన



రాయదుర్గం: జలమయమైన కొలిమివీధి



చీకలగురికి వద్ద కురుస్తున్న వర్షం

రాయదుర్గంటౌన్: కొలిమివీధి, రామస్వామివీధి, మీ సేవా ఏరియాలను ముంపు సమస్య వెంటాడుతూనే ఉంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు కురిసిన మోస్తరు వర్షానికే లోతట్టు ప్రాంతాలైన కొలిమిమీధి, రామస్వామివీధి, మీ సేవా ఏరియాల్లోని రోడ్లన్నీ జలమయ్యాయి. మంగళవారం అరగంట భారీ వర్షానికి జలమయమైన వీధులు బుధవారం మోస్తరు వర్షానికే నీరు డ్రైనేజీలు పొంగి రోడ్లపైకి నీరు రావడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మా ముంపు కష్టాలను ఎప్పుడు తీరుస్తారని ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

విడపనకల్లులో మోస్తరు వర్షం

విడపనకల్లు: మండలంలో చీకలగురికి, ఉండబండ, పెద్దకొట్టాలపల్లి, మాళాపురం తదితర గ్రామాల్లో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. గత రెండు మూడు రోజులుగా మండలంలో వర్షాలు కురుస్తుడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.వర్షాలు కురవడంతో సేద్యం చేసుకోవడానికి అదునుగా ఉందని చెబుతున్నారు. వంకలు, కుంటలు నీటితో నిండి కళకళాడుతున్నాయి.

సర్వర్ డౌన్..



రేషన్ కార్డులో మార్పులు చేర్పులకు సచివాలయానికి వచ్చిన ప్రజలు

కూడేరు: రేషన్ కార్డులో పేర్లు, అడ్రస్ మార్పులు, చేర్పులు, తొలగింపునకు ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేయడంతో ప్రజలు సచివాలయాలకు పరుగులు పెడుతున్నారు. బుధవారం కూడేరు, మరుట్ల, కమ్మూరు, గొటుకూరు, పి.నారాయణపురం , కొర్రకోడుతో పాటు మరికొన్ని సచివాలయాల్లో సర్వర్ మొరాయించింది. దీంతో ప్రజలు గంటల తరబడి సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. కొందరు అక్కడే వేచి ఉండలేక వెనుదిరిగారు. పని జరగక పోవడంతో సచివాలయ ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు.

క్లుప్తంగా

యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు



పైప్‌లైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: రాతిబావివంక గ్రామ గేటు వద్ద హెచ్చెల్సీ తాగునీటి పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులను యుద్ధ ప్రతిపాదికన చేపట్టారు. నీటి లీకేజీ కారణంగా రెండు రోజుల పాటు పట్టణంలో నీటి సరఫరాను నిలిపివేసిన విషయం తెలిసిందే. ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నుంచి మరమ్మతు పనులు చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాళ్ల శిల్ప పనులను పరిశీలించారు. ఏఈ నరసింహులుతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. సకాలంలో లీకేజీ మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

విడపనకల్లు: తిరుపతిలో ఇంజినీరింగ్ చదువుతున్న దళిత విద్యార్థి జేమ్స్‌ను కులం పేరుతో దూషించి, దాడి చేసిన గుండాలను వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కెంగూరి ఎర్రిస్వామి, మండల అధ్యక్షులు పి.నాగరాజు, వెంకటేశులు, మల్లయ్య డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందని బుధవారం వారు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దళితులంటే అగ్రవర్ణ కులాలకు చులకనగా చూసే భావం తగ్గలేదని మండిపడ్డారు. దళిత విద్యార్థిపై దాడులు చేసి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. దళిత విద్యార్థికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపొద్దు



వీధి నాటకం ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కూడేరు: ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపొద్దని ఎల్‌డబ్ల్యూఎస్ డీఆర్‌పీ రమేష్ యాదవ్ సూచించారు. బుధవారం కూడేరులోని వైఎస్సార్ సర్కిల్‌లో ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జంగం శ్రీనివాసులు కళాబృందం ఎయిడ్స్‌పై వీధినాటకం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఎయిడ్స్ ఏవిధంగా వ్యాప్తి చెందుతుందో వివరించారు. ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సి జాగ్రతలను వివరించారు. కార్యక్రమంలో జోనల్ సూపర్‌వైజర్ శ్రీరాములు, లింక్‌వర్కర్ రాజేశ్వరి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కళ్యాణదుర్గం రూరల్: మోరేపల్లి వద్ద పోలీసులు కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నారు. బుధవారం పూజారి ఫణి అనే వ్యక్తి బైక్‌పై కర్ణాటక మద్యాన్ని కళ్యాణదుర్గంకు తరలించేందుకు యత్నించాడు. ఎక్సైజ్ పోలీసులను గమనించి పారిపోయేందుకు యత్నించగా అతడిని పట్టుకున్నారు. నిందితుడి నుంచి 192 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ గురుప్రసాద్, డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కూలీకి తీవ్రగాయాలు

శెట్టూరు: ముచ్చర్లపల్లి సమీపంలో కూలీలు వెళ్తున్న ఆటోను మరో ఆటో ఢీకొని ఒక మహిళ తీవ్రగాయాలపాలైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. బుధవారం ఉదయం ముచ్చర్లపల్లి నుంచి సుమారు 10 మంది కూలీలను తీసుకొని ఆటో డ్రైవర్ మల్లికార్జున పొలంలోకి బయలుదేరాడు. అదే గ్రామానికి చెందిన మరో ఆటో డ్రైవర్ ధనుంజయ పక్కనే ఉన్న ములకలేడు గ్రామంలో కూలీలను వదిలి, తిరుగు ప్రయాణమయ్యాడు. ముచ్చర్లపల్లి శివారు ప్రాంతంలో కూలీలతో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొన్నాడు. ఘటనలో భూమిక అనే మహిళా కూలీ తీవ్రంగా గాయపడింది. ప్రథమచికిత్స తర్వాత అనంతపురం తీసుకెళ్లారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కూడేరు: మండల పరిధిలోని కుష్ఠ రోగుల కాలనీ వద్ద ఆదివారం కమ్మూరుకు చెందిన విజయ్ (25) అనే యువకుడు రోడ్డు ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం వేకువజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్‌బీఐ సర్వీసు సెంటర్‌లో చోరీ

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో ఉన్న ఎస్‌బీఐ కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో చోరీ జరిగింది. బుధవారం తెల్లవారు జామున ఈ ఘటన చోటు చేసుకుంది. దొంగలు సెంబర్‌పై భాగంలో కన్నం వేసి లోపలికి దిగారు. క్యాష్ బ్యాక్స్‌లో ఉన్న రూ.1,000 నగదుతో పాటు కొన్ని విలువైన వస్తువులను అపహరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



విత్తనశుద్ధి చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: జీవవైవిధ్య పంటలను పండించడంతో సారవంతమైన నేల సాగుకు దోహదపడుతుందని రాయదుర్గం ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఇన్‌చార్జి భీమన్న అన్నారు. బుధవారం మండలంలోని గోవిందవాడ గ్రామంలో రైతు బసప్పకు చెందిన ఆరు ఎకరాల పొలంలో పీఎండీఎస్ పద్ధతిలో విత్తనాలపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల డోర్ డెలివరీ



కొరియర్ ద్వారా పాఠ్యపుస్తకాలను పంపిన రసీదులు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని శ్రీచైతన్య, నారాయణ, పాఠశాలల్లో యాజ్యమాన్య ధన దాహానికి అడ్డూ అదుపులేకుండా పోయింది. విద్యార్థుల పాఠ్యపుస్తకాలను ఏకంగా డోర్‌డెలివరీ చేస్తున్నారు. గతంలో విద్యార్థి సంఘాల ఒత్తిడితో విద్యాశాఖ అధికారులు పాఠ్య పుస్తకాల గదులను సీజ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో పట్టణంలోని శ్రీచైతన్య, నారాయణ స్కూల్ యాజమాన్యాలు ఏకంగా విద్యార్థుల ఇళ్లకు పాఠ్యపుస్తకాలను కొరియర్ ద్వారా పంపుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి నిబంధనలు పాటించని సదరు పాఠశాలల యాజమన్యాలపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయకుల డిమాండ్ చేస్తున్నారు.

హనుమంతరాయ స్వామికి పూజలు



హోమం చేస్తున్న అర్చకులు

బొకుగుప్ప: మండల పరిధిలోని ఎర్రగుడి గ్రామంలో బుధవారం హనుమంతరాయ స్వామి దేవాలయం వద్ద కలశ గోపుర ప్రతిష్ఠ పూజలు, హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంపై 14 అడుగుల విగ్రహానికి హనుమంతరాయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఆలయ సేవా కమిటీ సభ్యులు దాతలతో కలసి అన్నదానం చేపట్టారు.

'సూపరింటెండెంట్‌ను విధుల్లోకి తీసుకోవద్దు'



జేఎన్‌టీయూ వీసీకి వినతిపత్రం అందజేస్తున్న మంజునాథరెడ్డి

కూడేరు: జేఎన్‌టీయూ సూపరింటెండెంట్ నాగభూషణంను విధుల్లోకి తీసుకోవద్దని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి కోరారు. బుధవారం జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్ రావును కలసి వినతిపత్రం అందజేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మాజీ ఎంపీని సూపరింటెండెంట్ దుర్భాషలాడారని తెలియజేశారు. చదువులకు నిలయంగా విశ్వవిద్యాలయం ఉండాలి. కానీ రాజకీయాలు ప్రోత్సహించేందుకు ఉండకూడదని తెలిపారు. ఆయన్ను విధుల్లోకి తీసుకోవద్దని కోరారు.